# ఆ కా శ పు టం చు లు

"ఏం కావాలండీ"

ఆ కంఠస్వరం అతి మృదువుగా, నమ్రతగా ఉన్నా సింహగర్జనలా వినిపించింది ఆనందరావుకి. వికటాట్టహాసంతో ఎవరో సవాలు చేసినట్టయింది.

"ఏం కావాలి?"

ఏం కావాలని చెప్పాలి ? ఏం కావాలని వచ్చాడు ? నిరుత్తరంగా కొనుగోలుదార్లవైపు చూస్తూ నిలబడ్డాడు ఆనందరావు.

అందరూ ఏవేవో అడుగుతున్నారు. ఏవేవో కొంటున్నారు. ఏదో సంతృప్తి అందరి ముఖాల్లో తాండవిస్తుంది. తన కేమిటి లోపమయింది ? ఒకసారి తనవైపు చూసుకున్నాడు ఆనందరావు. ఆ క్షణంలో చాలామంది తన తనవైపు చూస్తూండటం గమనించాడతను. అసంతృప్తిగా నవ్వుకున్నాడు. తన విలువైన దుస్తులూ, ఠీవిగల విగ్రహం అందర్నీ ఆకర్షిస్తున్నాయి.

ఎంతమందో తననిచూసి ఈర్ష్యపడుతున్నట్లు వాళ్ళ చూపుల్నిబట్టి పసిగట్టాడు. లక్షలాది ప్రజలకి అందరానివీ, వూహించ నలవికానివీ తనకి లభ్యమయాయి. ఏది తలుచుకున్నా, అది చిటికెల్లో తనకి చేకూరుతుంది. అయినా ఏవో కావాలని తాపత్రయం. ఒక్కసారి కలయ చూశాడు ఆనందరావు.

గుండుసూది దగ్గర్నించీ మోటారు దాకా ప్రతి వస్తువూ సరఫరాచేసే డిపార్ట్‌మెంటల్ స్టోర్, ఏదో ఒకటి కొనాలి వెధవడబ్బు. డబ్బు మంచినీళ్ళలా ఖర్చు పెడితే కాని తనకి తోచదు. డబ్బంటే అసహ్యం. అనూహ్యమైన

అసహ్యం. పెట్టెలనిండా బ్యాంకులనిండా మూల్గుతోంది. నిర్లక్ష్యంగా ఖర్చుపెడితేనే కొంతలో కొంత మానసిక తృప్తి. బోలెడు సంపాదించాడు. ఎలా సంపాదిస్తే ఏం? అన్యాయం.

మోసం.

లంచగొండితనం.

అయితే ఏం ?

ప్రపంచంలో ఇవిలేని చోటెక్కడ? వాటిని తన గుప్పెటలో ఇరికించుకుని ధైర్యంగా ముందడుగు వెయ్యకపోతే ప్రపంచమంతా నిండిన ఆదర్శం తనని కబళించి వేసేది !

ఇప్పుడు ఆ న్యాయాన్ని, మోసాన్ని, లంచగొండి తనాన్ని తను తలుచుకుని తిరస్కార పూర్వకంగా నవ్వగలడు. వాటికి బలియైపోతే, నాకు నామరూపాలు లేకుండా నశించిపోతే ఎవరు కనికరించేవాడు ? ఈ క్షణాన తను అన్యాయాన్ని విసర్జించగలడు, మోసాన్ని మానివేయగలడు, లంచగొండి తనాన్ని దూరంగా తననించి తరిమివేయగలడు. అదంతా తన చేతిలోనిపని. నిజానికిప్పుడు తను వాటికి దూరంగానేఉన్నాడు. గతంగతః

"ఏం కావాలండీ ?"

అణకువతో అడుగుతున్నారు షాప్ అసిస్టెంట్లు, తను గొప్ప అధికారి. తనని దూరాన చూడగానే అందరూ గుర్తుపట్టి 'ఫలానా అని గుసగుసగా చెప్పుకుంటూ దగ్గరకొస్తే ఒంగి ఒంగి సలాములు చేస్తారు. 'ధర్మరాజు' అని మెచ్చుకుంటారు. ఎంతమందికి చేతికెముకలేకుండా దానం చేశాడు, అడిగిందే తడవుగా ఎన్ని సంస్థలకి విరాళాలిచ్చాడు. తన చిత్రపటాలు, ఎందరి ఇండ్లలో, ఎన్ని సంస్థల భవనాల్లో సగౌరవంగా పదిల పరుచుకుంటున్నారు !

తన చిరునవ్వుకోసం ఎలా పడిగాపులు కాచుకుంటారు జనం. అడియేం దాసులు ! రెండు చేతుల్తో విచ్చల విడిగా దోచిపెడ్తాడు. వెధవడబ్బు.

"ఏం కావాలండి?"

స్టోరులో ప్రతి డిపార్టుమెంటులోని 'విండోడిస్ప్లే' చూస్తూ నడుస్తున్న ఆనందరావుని ప్రతి షాప్ అసిస్టెంటూ వినయ విధేయతలతో అడగ సాగాడు. ఏం కావాలో ఆనందరావుకి తోచలేదు. ఏమీ తోచక బయల్దే రాడు. కారులో రావటం విసుగుపుట్టింది. కాలి నడకన బయల్దేరాడు. ప్రతిరోజూ ఏదో ఒక క్రొత్తవస్తువు కొంటేగాని తృప్తిపడని వింత ప్రవృత్తిఅతనిది.

ఏం కావాలి?

అన్నీ ఉన్నవే. కొత్తదేమీ కనిపించడంలేదు. ఉలెన్, కాటన్, సిల్కు సూట్లూ — సోఫాలు, కుర్చీలు, కుషన్లూ, సైకిళ్ళు, మోటార్ సైకిళ్ళ మోటారుకార్లు, రేడియోలు, గ్రామఫోనులు, రేడియో గ్రాములూ రక రకాల ఎలక్ట్రిక్ సామాన్లూ, ఫర్నిచర్ —

డన్లపిల్లోలు, మాట్రెసులు, తివాచీలు.

ఫాన్లు, రూమ్ ఎయిర్ కండిషనర్లూ పుస్తకాలు, కలాలు, స్టేషనరీ.

ఒకటేమిటి, రకాని కొకటి.

ఇప్పటికే ఇల్లంతా ఒక మ్యూజియం!

ఏమీ కొనబుద్ధి పుట్టటంలేదు. ఏదో కొనకుండా ఇంటికి వెళ్ళబుద్ధి పుట్టటం లేదు. ఏంచేయాలి? అంగట్లో అన్నీవున్నా అల్లుడినోట్లో శని అన్నట్లు సమస్త వస్తువాహనాలున్నా ఏదో తీరని కొరత. సమస్త సుఖాల నిచ్చే ధనంవుంది. జనులంతా వంగివంగి సలాములు చేసే పదవిని నిర్వహిం చాడు. అందరి ప్రశంసల్నీ అందుకునే పనుల్ని చేశాడు. పొద్దుటినించీ చీకటి పడేదాకా స్తోత్రం చేసే వంధిమాగధులున్నారు. సమస్త భోగ భాగ్యాలున్నాయి. వీటన్నిటితో పాటు ఎక్కడో ఏదో లోపం. ఏదో అసంతృప్తి. అది తీర్చుకోటానికి ఏదో కొత్త సుఖంకోసం అన్వేషణ.

అన్వేషించినకొద్దీ అది దూరం కావటం, ఏమిటిదంతా? ఏదో కొత్త వస్తువు చేకూర్చుకుంటే క్షణికానందం కలగటం ఇంతలోనే అదృశ్యం కావటం అతనికి మామూలు. ఈరోజు అదికూడా కరువైపోయింది. ఆనందరావు విస్పృహగా వెనక్కి తిరిగాడు. ఏదో కొనాలని జేబులోంచి తీసి చేతులో పట్టుకున్న వందరూపాయలనోటు స్టాల్‌లోని వస్తువుల్ని చూసి వెక్కిరింతగా రెపరెపలాడుతూ కన్పిస్తూ నవ్వుతోంది. పరధ్యానంగా నడుస్తున్న ఆనందరావునిచూసి అడ్డువచ్చేజనం ఒదిగి ఒదిగి నిలబడుతున్నారు. స్టోరు మెట్లుదిగి అతను నెమ్మదిగా అడుగులు వేస్తూ బజారులోకి వచ్చాడు.

బజారుకి రెండువైపులా గల దుకాణాల్ని, చూస్తూ ఆనందరావు నిరాశగా బజారుదాటి రోడ్డు మలుపు తిరగగానే, సుడిగాలి వీచింది. విసురుగా వచ్చిన ఆగాలికి చేతిలోని వందరూపాయల నోటు ఆనందరావుని తప్పించుకుని గాలిపటంలా ఎగిరి వాయువేగంతో ముందుకు దూసుకుపోయింది. దూసుకుపోతూ, ఇంటికిపోతున్న ఐదారుగురు పిల్లల్ని మురిపించి, కవ్వించింది. ఒక్కసారిగా ఆపిల్లలందరూ దానికోసం ఎగబడ్డారు. అందరూ ఇంచుమించు ఒక్కసారిగా చేతులువేసి తీసుకోవాలని ప్రయత్నించడంతో తలొక ముక్కామాత్రం దక్కింది. అందరూ తమకి దక్కిన ముక్కల వైపు నిరాశగా చూసి, కాసేపు పరికించి, పెదవివిరిచారు. చూపులతోనే ఒకరినొకరు కసురుకున్నారు.

ఆనందరావు కొద్దిదూరం నుంచి ఈ వింతదృశ్యం చూస్తూనే ఉన్నాడు. అతనికి సరదావేసింది. నవ్వుకూడా వచ్చింది. అందరూ వేలెడుపిల్లలే. అప్పుడే అందరికీ డబ్బంటే అంత ప్రీతి.! అంత అపేక్ష! వెధవడబ్బు! మౌనమౌనంగా ఒకరినొకరు చూచుకుంటూ జరిగింది అర్థంచేసుకోటానికి ప్రయత్నిస్తున్న ఆ పిల్లల గుంపుదగ్గిరకి చేరాడు ఆనందరావు. "ఏం చేస్తున్నారు?"

ఉలిక్కిపడి చూశారు పిల్లలందరూ అతనివైపు. ఆనందరావుని చూసి చూడగానే పై ప్రాణాలు పైనేపోయి పారిపోయారు. వాళ్ళందరూ - ఒకే ఒక చిన్నకుర్రవాడు మినహా.

ఆ పిల్లవాడు ఆనందరావువైపు బిత్తరపోయి చూశాడు. అతనికి కొద్ది దూరంలో పుస్తకాలు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. వాటి ప్రక్కనే ఒక చిన్న సిరాబుడ్డి ముక్కలుముక్కలై నల్లగా వికృతంగా రోడ్డుమీద మరకచేసింది.

ఆనందరావు ఈ దృశ్యం చూసి ఆ కుర్రవాడిని తేరిపారచూశాడు. బీద రికం అతని దుస్తుల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఎనిమిది తొమ్మిదేళ్ళ వయసుంటుందేమో, చారెడేసి కళ్ళతో ఆనందరావు ముఖంలోకి ఆందో ళనగా చూడసాగాడు. మొదట ఆ కుర్రవాడిని అనునయించి ఇద్దామని పించింది ఆనందరావుకి. కాని ఇంతలో అతనికి మనసు మారింది. నోటుకోసం అందరితోపాటు ఆ కుర్రవాడు కూడా పరుగెత్తటం అతని మనోవీధిలో కనిపించింది. డబ్బంటే ఏమిటోకూడ తెలియని వయసు లోనే వాడికింత ఆశదేనికి ? కసికొద్దీ సంపాదించి తగలెయ్యటం పెద్ద వాళ్ళు చెయ్యవలసిన పని. చిన్నప్పటినుంచీ డబ్బుగొడవలతో సతమతం కావటం, దాని ఆకర్షణలకి లోనుగావటం సుతరామూ తనకి గిట్టదు.

ఈ ఆలోచనలు రాగానే ఆనందరావుకి ఆ కుర్రవాడిమీద కొంచెం కోపమూ విముఖతా కలిగాయి. కొద్ది క్షణాలు వాడివైపు అలాగేచూసి వాడిని పలక రించకుండానే అతను వెళ్ళిపోయాడు.

ఆ పిల్లవాడుకూడా అచేతనంగా ఆనందరావువైపు చూస్తూ అతడు అక్కడి నుంచి వెళ్ళిపోగానే తన ప్రపంచంలో పడ్డాడు.

వేడెక్కిన మనసుతో, తీరని అసంతృప్తితో ఆనందరావు నడుస్తున్నాడు.

"ఏమండి !"

హీనస్వరంతో బెదురు బెదురుగా రెండు మూడు సార్లు ఎవరో పిలవటం విని ఆనందరావు వేడెక్కి తిరిగి చూసి కొంచెం ఆశ్చర్యపడ్డాడు.

ఆ కుర్రవాడే!

"ఎందుకు?"

భయం భయంగా ఆ కుర్రవాడు చేతిలోని కొన్ని కాగితం ముక్కల్ని ఆనందరావు కిస్తూ అన్నాడు. "ఇవి మీవేనా అండి?"

ఆనందరావు ఆ కాగితం ముక్కలవైపు చూశాడు. అవి వందరూపాయల నోటుని అందరు కలిసి చింపిన ముక్కలు!

అప్రయత్నంగా తలవూపాడు ఆనందరావు, కొంచెం విస్మయంతో.

"తీసుకోండి. గాలికి ఎగిరిపోతుంటే పట్టుకుందామని పరుగెత్తాను. నా స్నేహితులు కలియబడితే చిరిగిపోయింది. పనికొస్తుందాండి?"

ఆతృతగా ఆనందరావువైపు చూస్తూ అన్నాడు ఆ కుర్రవాడు. అప్రయత్నంగా అతనా కాగితం ముక్కలు తీసుకున్నాడు.

"ఇదేమిటో తెలుసా?"

"డబ్బుకదండి?"

"ఎంత?"

తెలియ దన్నట్టుగా చిన్నబోతూ, తెల్లబోతూ తలూపాడు కుర్రవాడు.

"వందరూపాయలు తెలుసా?"

"అలాగండి?"

"కావాలా?"

"ఉహూ" తల అడ్డంగా వూపాడు కుర్రవాడు.

"కావలసినవన్నీ కొనుక్కోవచ్చు - కొత్తనోటు ఇస్తే తీసుకుంటావా?"

"ఒద్దండి," అనేసి, ఇంక సంభాషణ పెంచటం ఇష్టంలేదన్నట్టుగా వెళ్ళి పోయాడు కుర్రవాడు.

"పోనీ. ఈ రూపాయి తీసుకో."

"ఊరికే డబ్బు తీసుకోకూడదు కదండి,"

"ఊరికే డబ్బు తీసుకోకూడదు కదండీ," అనేసి ఆ కుర్రవాడు మళ్లీ వెళ్ళటానికి ప్రయత్నించాడు.

"ఇంట్లో ఎవరైనా కోప్పడతారా?"

"కాదండి ..."

"అయితే ఎందుకు తీసుకోవు?"

సమాధానంకోసం వెతికాడు కుర్రవాడు. కాని ఏమి తోచలేదు కాబోలు "నాకు తెలియదండి." అనేసి వెళ్ళటాని కుపక్రమించేడు.

"పోనీ, ఏదైనా కొనిపెడతాను, తీసుకుంటావా?"

ఒక్క-క్షణం ఆలోచించి మాట్లాడకుండా వూరుకున్నాడు వాడు.

"ఏం కావాలి?"

"నా సిరాబుడ్డి కిందపడి పగిలిపోయిందండి."

నవ్వువచ్చింది ఆనందరావుకి. తనతో రమ్మన్నట్టుగా సంజ్ఞచేశాడు. కుర్ర వాడు అతనిని అనుసరించాడు. ఇద్దరూ మొదట ఆనందరావు వెళ్ళిన స్టోర్‌కి వెళ్ళారు.

ఇప్పుడు ఆనందరావుకి ఏ సందేహమూ లేదు.

"ఏం కావాలండీ?" వినయంగా అడిగాడు షాప్ అసిస్టెంటు.

"ఒక సిరాబుడ్డి"

అతి సాధారణమైన వస్తువు అడిగాడు ఆనందరావు తనంతట తాను, బహుశా మొట్టమొదటిసారిగా. బజారుకువెళ్ళి అంత స్వల్పమైన వస్తు

Mirzaguda, Secunderabad



వుల్ని స్వయంగా కొనటం ఏ చిన్నప్పుడో జరిగింది. అంతే!
కుర్రవాడిముఖం విప్పారింది.

పచ్చకాగితంకోసం పరిగెత్తి సిరాబుడ్డి పగల కొట్టుకుని, కాగితంముక్కలిచ్చివేసి కొత్తసిరాబుడ్డి సంపాదించుకున్నాడు. ఈ వూహ అస్పష్టంగా అతని మనసులో కదిలింది. కృతజ్ఞలతో ఆనందరావువైపు చూశాడతను. చూసి అదరిపడ్డాడు. ఆనందరావు కళ్ళు చెమ్మగిల్లాయి. ఆ కుర్రవాడికిదేమీ అర్ధంకాలేదు .... ప్రశ్నార్ధకంలా ఉన్న అతని ముఖభంగిమ చూసి చప్పున ఆనందరావు ముఖం తిప్పుకున్నాడు.

ఇదే స్టోర్‌లో ఎన్నెన్నో విలువలుగల వస్తువుల్ని కొన్నాడు పూర్వం. కాని చిన్నవస్తువుని కొన్న ఆ ఒక్కక్షణం — అన్ని సంవత్సరాల జీవితంలో — ఆ ఒక్కక్షణం తనెప్పుడు ఎరుగని అనుభవాన్నిస్తోంది. తన్నుతాను మర్చిపోయిన ఆనందరావు మళ్ళీ ఈ లోకంలో పడేసరికి కుర్రవాడు అక్కడ లేడు.

పొద్దెక్కి నిద్ర లేచినట్టుగా ఒక్కసారి గబుక్కున కళ్ళు పెద్దవిచేసి చుట్టూ చూసి 'స్టోర్' మెట్లుదిగి నడవసాగాడు ఆనందరావు. అతని మనసులో ఆ కుర్రవాడి విప్పారిన ముఖమే చిందులాడసాగింది.

(1960)

శ్రీకాకుళం